తెలంగాణ రాయలసీమ ఉత్తరాంధ్రల గోడు విందాం !
ప్రాంతీయ వివక్షకు వ్యతిరేకంగా ఆందోళన చేద్దాం !!

ప్రాంతీయ వివక్ష గురించి, అసమానతల గురించి రాష్ట్రంలో మళ్లీ చర్చ బాగా జరుగుతూ ఉంది. ప్రత్యేక తెలంగాణ సాధన కోసం తెలంగాణ ప్రాంతంలో అనేక కమిటీలు, వేదికలు ఏర్పడ్డాయి. తమ ఆందోళనకు ప్రజా ఉద్యమ రూపం ఇవ్వాలని వారు ప్రయత్నిస్తున్నారు. రాయలసీమవాసులు కూడా అదే స్థాయిలో కాకున్నా తాము అనుభవిస్తున్న వివక్ష గురించి మాట్లాడుతున్నారు. ఆల్మట్టి, ఎగువతుంగ వివాదాలు కృష్ణానదీ జలాల పంపకంలో మన రాష్ట్రంలో జరిగిన అన్యాయాన్ని మరొకసారి చర్చకు తెచ్చాయి. ఉత్తరాంధ్రవాసులు కూడా తమకు సమైక్య రాష్ట్రంలో జరిగిందేమిటి అని ప్రశ్నించడం మొదలుపెట్టారు.

అన్యాయానికి గురయినవాళ్లు తమకు జరిగిన అన్యాయాన్ని గుర్తించి ఆందోళన చేయడం ఎంత ముఖ్యమో, ఇతరులు ఆ అన్యాయాన్ని అర్థం చేసుకొని దానికి వ్యతిరేకంగా జరిగే ఆందోళనలోని న్యాయమైన ఆకాంక్షను గుర్తించడం కూడా అంతే ముఖ్యమని పౌరహక్కుల ఉద్యమం భావిస్తుంది. అందువల్ల, సమైక్య ఆంధ్రలో ఎక్కువగా అభివృద్ధి చెందిన ప్రాంతానికి కేంద్రమైన విజయవాడ నగరంలో 'ప్రాంతీయ వివక్ష' పైన ఈ సదస్సు నిర్వహిస్తున్నాం.

'ఐక్య రాష్ట్రంలో మనం చేరడం పొరపాటయింది. ఇప్పుడయినా వేరయిపోదాం' అనే అభిప్రాయం తెలంగాణ రాయలసీమలలో ఎప్పుడూ ఉంది. మన ముఖ్యమంత్రి అంటున్నట్టు అది పదవులు పోగొట్టుకున్న కాంగ్రెస్ నాయకులు ఈ రోజు అకస్మాత్తుగా ముందుకు తెచ్చిన నినాదం కాదు. సామాజిక రాజకీయ పరిస్థితులను బట్టి ఆ అభిప్రాయం ఒక్కొక్కసారి బలంగా వినిపిస్తుంది. ఒక్కొక్కసారి నివురుగప్పి ఉంటుంది. అయితే ఆ ఆలోచన ఆ ప్రాంతాలకు చెందినవారి మెదళ్లలో లేకుండ ఎప్పుడూ పోలేదు.

రాయలసీమ తెలంగాణలకు ఒక ప్రత్యేకత ఉంది. ఈ రెండు ప్రాంతాలలోనూ ఒక ప్రత్యేక ముద్ర ఉన్న సంస్కృతి, మాటలలో ఒక ప్రత్యేక నుడికారం, ఒక ప్రత్యేక చరిత్రతో పెనవేసుకున్న 'ఐడెంటిటీ' ఉన్నాయి. 'మేము' అనే బలమైన భావన ఉంది. ఈ భావన కారణంగా, తెలుగువారంతా ఒకటిగా బ్రతకాలన్న వాదనను ఈ రెండు ప్రాంతాల మేధావులూ రాజకీయ నాయకులూ మొదటి నుండి అనుమానంగా చూసారు. తెలుగుజాతి ఒకటేనన్న ఆలోచనలోని ఆదర్శాన్ని వాళ్లు గుర్తించకపోలేదు. అయితే కృష్ణా, గోదావరి ఆనకట్టల వల్ల, బ్రిటిష్ వాళ్లు వదిలివెళ్లిన ఆధునికతను - ఇంగ్లీష్ భాష, పాలనా వ్యవహారాలు, పార్లమెంటరీ ప్రజాస్వామ్య రాజకీయాలు, విద్య, సాంకేతిక నైపుణ్యం, పెట్టుబడిదారీ వర్తక సరళి-తమకంటె ముందు నుండి అలవరచుకొని ఉండడంవల్ల, ఐక్య రాష్ట్రంలో కోస్తా జిల్లాలదే పైచేయి అవుతుందని వాళ్లు సహేతుకంగా సందేహించారు. తెలుగుజాతి ఒక్కటిగా పురోగమించినప్పుడే అది ఒక్కటి అవుతుందిగానీ కేవలం ఒకరాష్ట్రంలో ఉన్నంత మాత్రాన అది ఒక్కటి కాదు. ఆ సమదృష్టి, ఐక్య పురోగతి నిజంగా ఒనగూడుతాయా అని వాళ్లు సందేహించడంలో తప్పు లేదు.

అనుమానాలు ఉంటుండగానే తెలుగువారందరూ క్రమంగా ఒకటయ్యారు. మొదట (1953లో) కోస్తా, రాయలసీమ జిల్లాలు మద్రాసు నుండి వేరుపడగా ఆ తరువాత (1956లో) వారిరువురూ తెలంగాణవాసులతో కలిసి 'ఆంధ్రప్రదేశ్' అనే రాష్ట్రం ఏర్పాటు చేసుకున్నారు. ఐక్యమైతే అయ్యారుగానీ రాయలసీమ నాయకులూ, తెలంగాణ నాయకులూ తమ అనుమానాలకు బేషరతుగా సెలవు పలకలేదు. కోస్తా జిల్లాల నాయకత్వం నుండి కొన్ని నిర్దిష్టమైన హామీలు కోరారు, పొందారు. రాయలసీమ పొందిన హామీని శ్రీబాగ్ ఒప్పందం అంటారు. 1937లోనే జరిగిన ఈ ఒప్పందంలో, ఐక్య రాష్ట్రంలో రాయలసీమ కరువు తీర్చే నీటిపారుదల ప్రాజెక్టులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందని ఒప్పుకున్నారు. రాయలసీమకు నీటిలేమి ప్రధాన సమస్య కాబట్టి (రాయలసీమ సగటు వర్షపాతం కోస్తా జిల్లాల సగటు వర్షపాతంలో సరిగ్గా సగం) శ్రీబాగ్ ఒప్పందంలో రాయలసీమ నాయకులు నీటిపారుదల ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వడం సహజం.

తెలంగాణ పొందిన హామీని 'పెద్దమనుషుల ఒప్పందం' అంటారు. ఇది 1956లో తెలంగాణ నాయకులకూ అప్పటి ఆంధ్ర రాష్ట్ర నాయకులకూ మధ్య జరిగింది. తెలంగాణలో కూడా నీటి లేమి - రాయలసీమ అంతగా కాకున్నా - ఒక ముఖ్య సమస్యే. నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాలకు అది రాయలసీమతో సమానమైన సమస్యే. అయితే తెలంగాణ విద్యా వైద్య ఉద్యోగ రంగాలలోనూ, సాంఘిక వసతులలోనూ రాయలసీమ కంటె వెనుకబడి ఉన్నందున ఈ ఒప్పందంలో తెలంగాణ నాయకులు కేవలం సాగునీటి గురించి కాక మొత్తంగా అభివృద్ధి ప్రణాళికలలోనూ వ్యయంలోనూ సమదృష్టి ఉండాలన్న హామీ కోరారు, పొందారు.

పూర్తిగా సహేతుకమైన ఈ హామీలు ఐక్య రాష్ట్రంలో అమలు కాలేదన్న ఘోషే ఆ తరువాత ఈ రెండు ప్రాంతాలలోనూ తలెత్తిన 'ప్రాంతీయ ఉద్యమాల' చరిత్ర. ఐక్య ఆంధ్రకు ముందు షరతుగా చేసుకున్న న్యాయమైన ఒప్పందాలు అమలు కాలేదని ఆవేదన చెందడం 'ప్రాంతీయతత్వం' ఎందుకవుతుందో ఆరోపించే వాళ్లకే తెలియాలి.

సమ అభివృద్ధి, సమాన అవకాశాలు ఒక ప్రజాస్వామిక హక్కు అనే ప్రాతిపదికన ఈ ఉద్యమాల గురించి ఆలోచించాలే తప్ప ఐక్యతావాదం - వేర్పాటువాదం అనే ప్రాతిపదికన కాదని పౌరహక్కుల సంఘం భావిస్తుంది. ప్రకృతి

సంపద అన్ని ప్రాంతాలలోనూ సమానంగా ఉండదు. ప్రకృతిసిద్ధంగా వెనుకబడి ఉన్న ప్రాంతాలలో పెట్టుబడి ఎక్కువ పెట్టాలి, ఆ ప్రాంతాల పురోగతి కోసం రెవెన్యూ వనరులు కూడా ఎక్కువ వెచ్చించాలి. ఆర్థిక అభివృద్ధి, విద్యా వైద్య తదితర రంగాల అభివృద్ధి, చారిత్రక కారణాలవల్ల అన్ని ప్రాంతాలలోనూ సమానంగా ఉండదు. అభివృద్ధి కుంటుపడిన ప్రాంతాల కోసం పెట్టుబడి, రెవెన్యూ వనరులు ఎక్కువ ఖర్చు చేయాలి.

అయితే 'నీరుపల్లమెరుగు' నన్నట్టు ఇతర వనరులు సమృద్ధిగా ఉన్న ప్రాంతాలకే పెట్టుబడి ఎక్కువగా ప్రవహిస్తుంది. అభివృద్ధి చెందిన ప్రాంతాలనే మరింత అభివృద్ధి చేస్తుంది. అందువల్ల ప్రభుత్వం సమదృష్టితో పెట్టుబడిని నియంత్రించాలి. ప్రాంతీయ అసమానతలు తొలగిపోయే రీతిలో తన అదుపులో ఉన్న పెట్టుబడిని, రెవెన్యూ వనరులను కేటాయించాలి. ఖర్చు చేయాలి. ప్రాంతీయ అసమానతలను ప్రయత్నపూర్వకంగా పోగొట్టాలి. దీనికొక ప్రజాస్వామిక దృక్పథం ఉన్న పాలనా విధానం కావాలి. అది ఎందుకు లోపించిందో అర్థం చేసుకొని సవరించడానికి కృషి చేయడం ప్రజాస్వామికవాదుల కర్తవ్యం. అందుకోసం వివక్ష గురించి ఆందోళన చేస్తున్న వారి మాటలు ముందు వినాలి. విని ఆలోచించాలి. వారిని వేర్పాటువాదులు, విచ్ఛిన్నకారులు అనడం మానేయాలి. ఒక సమస్య న్యాయమైనదయినప్పుడు దానికి తమకు తోచిన పరిష్కారాన్ని ప్రతిపాదించే హక్కు ఆ సమస్యకు లోనయిన ప్రజలకు ఉంటుందని గుర్తించాలి. ఈ అవగాహన పెంపొందించడానికే పౌరహక్కుల సంఘం ఈ సదస్సు నిర్వహిస్తూ ఉంది.

నాలుగు దశాబ్దాల సమైక్య రాష్ట్ర అనుభవమేమిటంటే రాయలసీమలో పలు ప్రాంతాలు ఎడారి కానున్నాయి. తెలంగాణ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు ఉంది. హైదరాబాద్ నగరమూ దాని పరిసరాలూ బాగా అభివృద్ధి చెందిన మాట వాస్తవమే. కానీ ఈ అభివృద్ధి వల్ల తెలంగాణవాసులు పొందిన ప్రయోజనం స్వల్పమే. ఇతర ప్రాంతాల వాళ్లే ఎక్కువ ప్రయోజనం పొందారు. ఆ మాట అంటే, 'హైదరాబాద్ రాష్ట్ర రాజధాని అయినప్పుడు అది ఒక ప్రాంతం వారికే ఎట్లా చెందుతుంది' అని ఇతర ప్రాంతాలవారు దబాయిస్తారు కూడా. ఆ దబాయింపు సహేతుకమైతే హైదరాబాద్ అభివృద్ధిని తెలంగాణ అభివృద్ధిగా ఎంచకూడదు. హైదరాబాద్‌ను తీసేసి చూస్తేనే తెలంగాణకు ఏమొరిగిందో అర్థం అవుతుంది. ఉత్తరాంధ్రవాసులు కూడా తమ ప్రాంతానికి కేంద్ర పట్టణమైన విశాఖపట్నం గురించి ఇదే మాట అనగలరేమో !

ప్రాంతీయ వెనుకబాటుతనం గురించి మాట్లాడడం అభివృద్ధి చెందిన ప్రాంతాలపైన ద్వేషం రెచ్చగొట్టడానికా అని అడుగుతారేమో. ఎవరూ ఎవరినీ ద్వేషించనవసరం లేదు. ద్వేషించమని చెప్పడం పౌరహక్కుల సంఘం ఉద్దేశ్యం కాదు. కానీ ద్వేషానికి కారణమైన పరిస్థితులను గుర్తించి సవరించే ప్రయత్నం అందరూ చేయకపోతే ద్వేషాలు - ఎంత అవాంఛనీయం అయినా - సమసిపోవు. అన్యాయం ఎక్కడున్నా దానిని అందరూ ద్వేషించడం నేర్చుకుంటేనే మనిషిని మనిషి ద్వేషించే పరిస్థితి రాదు. అందువల్ల వివక్షకు గురైన ప్రాంతాల సమస్యల పట్ల ఇతర ప్రాంతాలలో సదవగాహన పెంపొందించడం కోసమే విజయవాడలో ఈ సదస్సు నిర్వహిస్తున్నాము.

సదస్సు

ఆగష్టు 24 ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గం॥ల వరకు

హనుమంతరాయ గ్రంథాలయం, గాంధీనగర్, (రైల్వేస్టేషన్ సమీపంలో) విజయవాడ

వక్తలు : డా॥ జయశంకర్ (మాజీ వైస్ ఛాన్సలర్, కాకతీయ యూనివర్సిటీ)

డా॥ సింహాద్రి (ఉస్మానియా యూనివర్సిటీ)

Ch. చంద్ర శేఖరరెడ్డి (రాయలసీమ ప్రజాసమితి)

ప్రొఫెసర్ శేషయ్య (శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ)

ప్రొఫెసర్ కె. ఎస్. చలం (ఆంధ్రా యూనివర్సిటీ)

విజయవాడ
16-8-97

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం

APCLC

పౌరహక్కుల వేదిక స్వేచ్ఛ పత్రిక చదవండి